సాక్షి సంగారెడ్డి

గురువారం । 12 । అక్టోబర్ । 2023



ఆశపడితే అంతే సంగతులు

సైబర్ నేరాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. జిల్లాలో 515 సైబర్ మోసాల కేసులు నమోదయ్యాయి. వివరాలు 10లో ▸



రైతుల ఆశలపై నీళ్లు

ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పత్తి పంటకు మొదటి కాత దశలోనే తెగుళ్లు సోకుతున్నాయి. వివరాలు 11లో ▸

నేడు పట్టణంలో కరెంట్ కోత

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని 33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం టౌన్‌లో విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏడీఏ మధుసూదన్ బుధవారం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పట్టణమంతా కరెంట్ సరఫరా ఉండదని విజ్ఞప్తి చేశారు.

న్యూస్‌రీల్

అక్రమ నిర్మాణాల కూల్చివేత

పలువురిపై కేసు నమోదు

జిన్నారం(పటాన్‌చెరు): ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను రెవెన్యూ సిబ్బంది కూల్చివేసింది. బుధవారం మండలంలోని ఖాజీపల్లి గ్రామ శివారులోని 181 సర్వే నంబర్ గల ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారనే ఫిర్యాదులు అందాయి. హుటాహుటిన తహసీల్దార్ రవికుమార్ ఆదేశాల మేరకు ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. ఆపై వాటిని కూల్చివేశారు. నిందితులైన వరకంటి సాయిలు, గొల్ల వేణు, వడ్ల రాజు, భానుకిరణ్, కొండా లక్ష్మణ్, జీతయ్యలపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని ఆర్ఐ తెలిపారు.

పశువులకు కృత్రిమ గర్భధారణ చేయించాలి



శిబిరంలో పశువును పరిశీలిస్తున్న డాక్టర్ కొండల్‌రెడ్డి

వట్‌పల్లి(అందోల్): రైతులందరూ మేలు జాతి దూడల కోసం పశువులకు కృత్రిమ గర్భధారణ చేయించాలని మెదక్ జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఈవో డాక్టర్ కొండల్ రెడ్డి సూచించారు. బుధవారం అందోల్ మండలం కోడెకల్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. జన్మించిన లేగ దూడలకు 15 రోజుల్లోపు నట్టల నివారణ మందులు వేయాలని సూచించారు. పశువులకు గర్భస్రావానికి గల కారణాలను గుర్తించాలన్నారు. అవి బలహీన పడకుండా మందులు తాగించాలని సూచించారు. కార్యక్రమంలో నాదులాపూర్ పశు వైద్యశాల వెటర్నరీ డాక్టర్ సంధ్య, గోపాలమిత్ర సూపర్‌వైజర్ అర్జునయ్య, వీఏ అనీషా బేగం, గ్రామ పెద్దలు నర్సింహారెడ్డి, గోపాలమిత్రలు కె.ఆర్.ప్రభు, నాగరాజు, శంకర్, యాదయ్య, మాణిక్యం, రైతులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి టోకరా

37 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైం జాబ్ పేరిట ఫోన్‌కు వచ్చిన వాట్సాప్ మెసేజ్ కు స్పందించిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి భారీ నగదు పోగొట్టుకున్నాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఆగస్టు 30న పార్ట్ టైం జాబ్ పేరిట వాట్సాప్‌కు మెసేజ్ రాగా బీరంగూడ లక్ష్మీ సాయి మీడోస్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి స్పందించాడు. అందులో తన వివరాలను నమోదు చేశాడు. సైబర్ కేటుగాడు వాలెట్ ఐడీ క్రియేట్ చేసి ఇచ్చాడు. మొదట రూ.5 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేయడం మొదలు పెట్టాడు. వాలెట్‌లో అతను పెట్టినవి, సైబర్ నేరగాళ్లు ఇచ్చినవి మొత్తంగా రూ. 37 లక్షల సహా కమీషన్ చూపిస్తూ వచ్చాడు. ఉద్యోగికి అవసరమై మొత్తం ఇవ్వాలని అడుగగా స్పందించ లేదు. చివరకి బాధితుడు మోసపోయినట్లు గుర్తించి సైబర్, అమీన్‌పూర్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

'అడ్మిషన్ పేరుతో వసూళ్లు'



డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్ఐ నాయకులు

సంగారెడ్డి అర్బన్: బ్లూల నర్సింగ్ కాలేజీ యాజమాన్యం అడ్మిషన్ పేరుతో ప్రతి విద్యార్థి నుంచి రూ. 5 వేలు వసూలు చేస్తోందని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నేతలు డీఎంహెచ్‌ఓ గాయత్రిదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎర్రోళ్ల మహేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని బీరంగూడలో ఉన్న ఈ కళాశాల వారు 'జీఎన్ఎం' కోర్సుల పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నారని విమర్శించారు. మరో పక్క హాస్టల్, కళాశాల ఫీజులు ఒక్కో విద్యార్థి నుంచి వేలకు వేలు తీసుకుంటున్నారని అన్నారు. అంత తీసుకుంటున్నా.. కనీసం ప్రాక్టికల్ ల్యాబ్, లైబ్రరీ కూడా లేనటువంటి పరిస్థితి ఇక్కడ ఉందన్నారు. ఇద్దరు అధ్యాపకులతో బోధన కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ఇలా అడ్డగోలుగా ఫీజులు వసూళ్లకు పాల్పడుతున్నందున కాలేజీ గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం పట్టణ నాయకులు శ్రీనివాస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేతల కదలికలపై నిఘా

- పకడ్బందీగా ఎన్నికల నియమావళి అమలు
- పార్టీల ఫ్లెక్సీలు, ప్రచార బోర్డుల తొలగింపు

మునిపల్లి(అందోల్): ఎన్నికల నిబంధనల అమలుపై ఈసీ ప్రత్యేక దృష్టి సారించింది. ఆయా పార్టీల కదలికలపై రోజువారీగా నివేదికలు సేకరిస్తోంది. నిఘా వర్గాలు కోడ్ ఉల్లంఘనలను క్షుణంగా పరిశీలిస్తున్నాయి. ప్రచారంలో అభ్యర్థులు వ్యవహరించే తీరు, సామాజిక మాధ్యమాల్లో పోస్టులు ఇతర అంశాలపై పూర్తి సమాచారాన్ని సేకరిస్తున్నాయి. నియమావళి కారణంగా పథకాల ప్రచారం పూర్తిగా ఆపేయాలని, పథకాల పోస్టర్లు, ఫ్లెక్సీలు తొలగించాలని ఇప్పటికే మండలస్థాయి ఎన్నికల అధికారులకు ఆదేశాలు వచ్చాయి.

74 గంటల్లో తొలగింపు

ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించిన 24 గంటల్లోగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫొటోలు, పోస్టర్లు, ఫ్లెక్సీల తొలగింపు కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శులు ముమ్మరం చేశారు. 48 గంటల్లోగా అన్ని పబ్లిక్ స్థలాలు, 74 గంటల్లోగా ప్రైవేటు



తాటిపల్లిలో పోస్టర్లను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

స్థలాల్లో ఉన్న వీటినంతటినీ తొలగించాల్సి ఉంది.

అభ్యర్థుల ప్రచారంపై దృష్టి

రాజకీయ పార్టీల అభ్యర్థుల ప్రచారంపై మండలస్థాయి ఎన్నికల అధికారులు దృష్టిపెట్టారు. ఇప్పటికే బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించింది. ఆ పార్టీ తరఫున వారి కుటుంబీకులు, పార్టీ నాయకులు ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్‌లో సైతం ఆశావహులు ప్రచారం చేస్తున్నారు. కాగా సామాజిక కార్యక్రమాల పేరిట వారు నిర్వహించే కార్యక్రమాలు, రహస్య సమావేశాలపైనా కూడా వారు దృష్టి సారించారు. సామాజిక మాధ్యమాల్లో పెట్టే పోస్టులు సైతం పరిగణంలోకి తీసుకోనున్నారు. ఆ వివరాలతో కూడిన నివేదికను జిల్లా అధికారులకు పంపనున్నారు. జిల్లా స్థాయిలో ఎన్నికల అధికారుల వ్యవహరించే తీరు, ఫిర్యాదులపై స్పందించే విధానంపై ఎప్పటికప్పుడు నివేదికలు ద్వారా సమాచారం పంపుతామని పేర్కొంటున్నారు.

అనుమతులు తప్పనిసరి

ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించే సభలు, సమావేశాలు, ర్యాలీలకు తప్పనిసరిగా అనుమతి పొందాల్సి ఉంటుంది. ఇందుకు గాను డీఎస్పీ వద్ద దరఖాస్తు చేసుకోవాలి. సభకు ఎంతమంది హాజరవుతారు? ఎంత సేపు కొనసాగుతుంది? వాహనాలెన్ని, మైకుల ఏర్పాటు వంటి విషయాలపై పూర్తి సమాచారాన్ని సమర్పించాల్సి ఉంటుంది. ఎన్నికల కోడ్‌కు లోబడి అనుమతి లభిస్తుందని అధికారులు చెబుతున్నారు.

ఎస్పీ రమణకుమార్ బదిలీ

ఆదేశాలు జారీ చేసిన ఎన్నికల సంఘం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ఎస్పీ ఎం.రమణకుమార్‌కు బదిలీ అయ్యారు. రాష్ట్రంలో పలువురు ఐఏఎస్, ఐపీఎస్, ఇతర రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులను బదిలీ చేస్తూ ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 11 మంది నాన్ క్యాడర్ ఐపీఎస్‌లను బదిలీ చేయాలని ఆదేశించింది. ఇందులో భాగంగా ఆయనకు బదిలీ అయ్యింది. 2021 జూలై 30 ఎస్పీగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. సుమారు రెండేళ్ల మూడు నెలలపాటు విధులు నిర్వర్తించారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు జారీకి ముందు కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రంలో పర్యటించింది. కీలకమైన శాఖల అధికారులతో



సమీక్షలు నిర్వహించిన ఈసీ ఉన్నతాధికారులు రాష్ట్రంలో కీలక పదవుల్లో నాన్ కేడర్ అధికారులు ఉన్నట్లు గుర్తించారు. ఎన్నికల కోడ్ అమలులోకి రాగా ఉన్నతాధికారులను బదిలీ చేసే అధికారం ఎన్నికల సంఘానికి ఉంటుంది. ఈ నేపథ్యంలో పలు జిల్లాల ఎస్పీలను బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకుంది. కాగా అడిషనల్ ఎస్పీ అశోక్‌కు బాధ్యతలు అప్పగించాలని ఈసీ ఆదేశించింది.

రూ.15 లక్షల పట్టివేత

ఎన్నికల కోడ్ అమలులోకి రాగా జిల్లాలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. పటాన్‌చెరు, రామచంద్రాపురంలో మొత్తంగా రూ.15 లక్షల నగదును పట్టుకున్నారు. సరైన ఆధారాలు చూపని కారణంగా స్వాధీనం చేసుకున్న సొత్తును ఉన్నతాధికారులకు అప్పగించారు.

రూ. 9.95 లక్షల స్వాధీనం

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని పాత టోల్ గేటు సమీపంలో బుధవారం పోలీసులు, ట్రాఫిక్ సిబ్బంది చేపట్టిన తనిఖీలో నలుగురి నుంచి రూ. 9.95 లక్షలు పట్టుకున్నారు. అందులో కేబీహెచ్‌పీకి చెందిన కోటిరెడ్డి వద్ద రూ.5 లక్షలు, కూకట్‌పల్లికి చెందిన హేమంత్ నుంచి రూ.2.25 లక్షలు, తెల్లాపూర్‌కు చెందిన రామకృష్ణ వద్ద రూ.1. 60 లక్షలు, బీరంగూడకు చెందిన రాజ్‌కుమార్ నుంచి రూ. 1.10 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీలో సీఐ లాలూ నాయక్, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి, క్రైమ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డిలు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.5.05 లక్షలు సైతం..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పటాన్‌చెరు నుంచి లింగంపల్లి వైపు వస్తున్న కారులో రూ. 5,05,960లను పోలీసులు పట్టుకున్నారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని ఇక్రిశాట్ సమీపంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద చేపట్టిన తనిఖీల్లో రామచంద్రాపురం పోలీసులు.. నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆ సమయంలో కారులో నలుగురు ప్రయాణిస్తున్నారు. కాగా వారు సంబంధిత పత్రాలను చూపించలేదు. దీంతో స్వాధీనం చేసుకున్న నగదును జిల్లా ఎన్నికల అధికారులకు అప్పజెప్పామని ఇన్‌స్పెక్టర్ నరేందర్ రెడ్డి తెలిపారు.



పటాన్‌చెరులో కారు తనిఖీ చేస్తున్న పోలీసులు

డీలర్లకు బీఆర్ఎస్ భరోసా



రేషన్ డీలర్లతో టీఎస్‌హెచ్‌డీసీ చైర్మన్ చింతా ప్రభాకర్

టీఎస్‌హెచ్‌డీసీ చైర్మన్ చింతా ప్రభాకర్

సంగారెడ్డి: రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరిస్తానని టీఎస్ హెచ్‌డీసీ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. పట్టణంలో నియోజకవర్గ రేషన్ డీలర్‌లతో బుధవారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారంతా ఆయనకే పూర్తి మద్దతు ఇస్తామని ఏకగ్రీవ తీర్మానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. మంత్రి హరీశ్‌రావు సహకారంతో డీలర్ల డిమాండ్‌లను నెరవేరుస్తానని హామీనిచ్చారు. వచ్చే ఎన్నికల్లో తనను గెలిపిస్తే ప్రజా సమస్యలపై అసెంబ్లీలో గళం వినిపిస్తానని అన్నారు. తన ఆరోగ్యం కోసం ఆలయాలు, చర్చీలు, మసీదుల్లో ప్రార్థనలు చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరిరెడ్డి, విజేందర్‌రెడ్డి, అనంతయ్య, మందుల వరలక్ష్మి, కౌన్సిలర్ రామప్ప, రేషన్‌డీలర్‌లు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

మునిపల్లి(అందోల్): అన్నివర్గాల అభ్యున్నతే సీఎం కేసీఆర్ లక్ష్యమని అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ అన్నారు. బుధవారం మండలంలోని చిన్నచల్మెడ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఆయన సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రతి ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందాయని స్పష్టం చేశారు. వ్యవసాయ భూములున్న ప్రతి రైతుకూ ప్రభుత్వం రైతుబంధు పథకం అమలు చేస్తోందన్నారు. 24 గంటలపాటు విద్యుత్ సౌకర్యం, ఇంటింటికీ మిషన్ భగీరథ నల్లా ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నదన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలను అమలు చేస్తున్నది కూడా బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. దసరాకు బతుకమ్మ చీరెలను పంపిణీ కూడా చేస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రభు, బీఆర్ఎస్ యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు చిరస్మరణీయం



ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ సభ్యులు

సంగారెడ్డి అర్బన్: అమరుల త్యాగాలను స్మరించుకుంటూ దేశాన్ని కాపాడుతున్న మన సైనికుల గొప్పతనాన్ని చాటి చెప్పే గొప్ప మహోత్తర కార్యక్రమం మేరీ మట్టి మేరదేశ్ అని తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ రత్న ప్రసాద్ అన్నారు. అందులో భాగంగా అమృత్ కలశ్‌పై కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి కళాశాల నుంచి మట్టిని సేకరించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసే ట్రెన్ ద్వారా ఢిల్లీకి పంపుతామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రవీణ, ఎన్ఎస్ఎస్ అధికారులు జగదీశ్వర్, వెంకటేశం, పద్మాజీ, అభిజిత్, సిద్దులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలకు ప్రాధాన్యం

ప్రాంతీయ ఆస్పత్రుల జిల్లా సమన్వయకర్త సంగారెడ్డి

నారాయణఖేడ్: సీజనల్ వ్యాధులు ప్రబలుతుండగా రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించే విషయమై డాక్టర్లు నిర్లక్ష్యం వహించొద్దని ప్రాంతీయ ఆస్పత్రుల జిల్లా సమన్వయకర్త(డీసీహెచ్‌ఎ) సంగారెడ్డి.. సిబ్బందికి సూచించారు. బుధవారం ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రిని సందర్శించారు. రోగులకు సంబంధించిన వార్డులను పరిశీలించారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు విజృంభిస్తున్నందున అప్రమత్తతతో ఉండాలని సూచించారు. రోగులు, ప్రమాద బాధితులకు సత్వర చికిత్స అందించాలని ఆదేశించారు.ఆస్పత్రిలోనే ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. రోగులకు అందుబాటులో ఉన్న మందులు ఇతర విషయాలను అడిగి తెలుసుకున్నారు.



ప్రాంతీయ ఆస్పత్రిలో సమీక్ష నిర్వహిస్తున్న డీసీహెచ్‌ఎ సంగారెడ్డి

12 ఎమ్మెల్యేలు, 4 ఎంపీలు

- గొల్ల కురుమలకు కేటాయించాలి
- ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాపు

నారాయణఖేడ్: గొల్ల కురుమలకు కాంగ్రెస్ పార్టీ 12 ఎమ్మెల్యే, 4 ఎంపీ టికెట్లు కేటాయించాలని కోరుతూ గొర్రెలు, మేకల పెంపకందారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాపు మల్‌శెట్టి కోరారు. బుధవారం హైదరాబాద్‌లో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించి గొంగడితో సన్మానించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేయడానికి కేటాయిస్తే కలిసికట్టుగా కృషి చేసి గెలిపించుకుంటామన్నారు. పొరుగున ఉన్న కర్ణాటక, మహారాష్ట్రలో గొల్ల కురుమలు ఎస్టీలుగా ఉన్నందున తెలంగాణలో సైతం ఆ జాబితాలో చేర్చాలని కోరినట్లు తెలిపారు.

మతిస్థిమితం లేని మహిళ ప్రసవం

- పురిట్లోనే మగశిశువు మృతి
- ఖననం చేసిన సర్పంచ్
- మొగుడంపల్లిలో ఘటన

జహీరాబాద్ టౌన్: మతిస్థిమితం లేని మహిళ ప్రసవించిన సంఘటన మొగుడంపల్లి మండలంలో బుధవారం చోటుచేసుకుంది. తెలిసిన వివరాల ప్రకారం.. మండలంలో ఉన్న రాష్ట్ర సరిహద్దు గ్రామమైన ధనసిరికి రెండు నెలల క్రితం మతిస్థిమితం లేని ఓ మహిళ చేరుకుంది. అప్పటి నుంచి భిక్షాటన చేస్తూ బస్టాండ్ ప్రాంతంలో జీవిస్తోంది. ఆమె గర్భం దాల్చిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. బుధవారం పురిటి నొప్పులతో బాధపడుతుండగా గమనించిన స్థానికులు సర్పంచ్‌కు సమాచారం అందించారు. ఆయన ఆశావర్కర్లు, పంచాయతీ సిబ్బందిని ఘటనా స్థలికి రప్పించి వైద్యసేవలు అందేలా చేశారు. కాగా ఆమెకు ప్రసవమైంది. నెలలు నిండని కారణంగా మగబిడ్డ పురిట్లోనే చనిపోయింది. సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని సర్పంచ్ దగ్గరుండి ఖననం చేశారు. అనంతరం జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మహిళను చేర్పించారు. తన ఆరోగ్యం నిలకడగా ఉంది.



మహిళను ఆటోలో జహీరాబాద్ ఆస్పత్రికి తీసుకెళ్తున్న సర్పంచ్ హబ్బిరాజు తదితరులు

హక్కులకు భంగం వాటిల్లితే చర్యలు

జిల్లా సీనియర్ సివిల్ జడ్జి హన్మంతురావు

సంగారెడ్డి టౌన్: బాలల హక్కుల పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని, వాటికి భంగం వాటిల్లితే చర్యలు తప్పవని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి హన్మంతురావు అన్నారు. బుధవారం పట్టణంలోని మహిళా ప్రాంగణంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాలల హక్కులు, చట్టాలు, వారు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, అక్రమ రవాణా, బాల్యవివాహాలు, ఆరోగ్య జాగ్రత్తలు, బాలకార్మికుల నివారణ తదితర అంశాలపై అవగాహన అవసరమన్నారు. పిల్లలకు మైనర్ వివాహాలు చేయవద్దని గ్రామాల్లో ప్రచారం చేయాలని, చట్టాలపై తల్లిదండ్రులను జాగృతం చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. బాలల హెల్ప్ లైన్ నంబర్ 1098, మహిళ హెల్ప్ లైన్ నంబర్ 181, వీటితో పాటు 100 నంబర్‌లో సమస్యలపై ఫిర్యాదు చేయాలన్నారు. తొలుత పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూఓ సంధ్యారాణి, మహిళా ప్రాంగణం మేనేజర్ సుగుణ, గవర్నమెంట్ నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ పద్మజ పాల్గొన్నారు.



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న హన్మంతురావు

బహిరంగంగా దమ్ము కొడితే జైలే



దౌల్తాబాద్‌లో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

పొగాకు నియంత్రణ జిల్లా అధికారి విష్ణువర్ధన్ రెడ్డి

హత్నూర(సంగారెడ్డి): బహిరంగ ప్రదేశాల్లో పొగ తాగితే బాధ్యులపై కఠిన చర్యలతోపాటు రెండేళ్ల జైలు శిక్ష తప్పదని పొగాకు నియంత్రణ విభాగం జిల్లా అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం మండలంలోని దౌల్తాబాద్‌లో ర్యాలీ నిర్వహించి ధూమపానం చేస్తున్న వారికి అవగాహన కల్పించారు. బహిరంగ ప్రదేశాల్లో సిగరెట్, బీడీలు తాగడం చట్టవిరుద్ధమన్నారు. ప్రభుత్వం కూడా నిషేధం విధించిందని గుర్తుచేశారు. కాగా విద్యాలయాల వద్ద 100 మీటర్ల వరకు పొగాకు సేవించడం, ఉత్పత్తుల అమ్మకం నిషేధమని తెలిపారు. శ్యామ్, సుందర్ పాల్గొన్నారు.

అద్దె భవనంలోనే ఎక్సైజ్ కార్యాలయం

- జోగిపేటలో ఏడాదిన్నర క్రితమే నూతన భవన నిర్మాణం
- బిల్లులు అందక అప్పగించని కాంట్రాక్టర్
- అరకొర నదుపాయాల మధ్యే సిబ్బంది విధులు
- కోడ్ రావడంతో ఎన్నికల తర్వాతే ప్రారంభించే చాన్స్

వట్‌పల్లి(అందోల్): ఏడాదిన్నర క్రితమే ఎక్సైజ్ సర్కిల్ నూతన భవనం నిర్మాణం పూర్తి కాగా ప్రారంభానికి నోచలేదు. సదరు కాంట్రాక్టర్ బిల్లులు పెండింగ్ ఉన్నాయని భవనాన్ని అప్పగించలేదని సమాచారం. ఇంకా అద్దె భవనంలోనే కొనసాగుతుండగా సర్కారు ఖజానాపై భారం పడుతోంది. జోగిపేటలో ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం ఏళ్లుగా అద్దె భవనంలో కొనసాగుతోంది. నాలుగేళ్ల క్రితం నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ. 40 లక్షలు మంజూరు చేసింది. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. అనుకున్నదే తడువుగా నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన కాంట్రాక్టర్‌కు ఆ బాధ్యతలు అప్పగించింది. ఏడాదిలోపు పూర్తి చేసేలా ఒప్పందం జరిగింది. 2019లో జోగిపేట పట్టణంలో గల ఎన్టీఆర్ మైదాన సమీపంలోని ప్రభుత్వ స్థలంలో పనులను ప్రారంభించారు. నిర్మాణం కూడా



ప్రారంభానికి నోచుకోని ఎక్సైజ్ భవనం

పనులు పూర్తయ్యాయి. ఇదంతా జరిగి ఏడాదిన్నర గడుస్తున్నా హౌసింగ్ బోర్డు కాలనీలో అద్దె భవనంలోనే కార్యాలయాన్ని నిర్వహిస్తుండటం చర్చనీయాంశం అవుతోంది. నెలకు 7 వేల రూపాయల అద్దె రూపేణ చెల్లిస్తున్నారు. ఇంకా ఎందుకు సొంత భవనంలోకి కార్యాలయం తరలించలేదని ప్రశ్నలు స్థానికుల నుంచి ఉత్పన్నమవుతున్నాయి. ఏళ్ల తరబడి అద్దె చెల్లిస్తుండటంతో ప్రభుత్వ ఖజానాకు గండి పడుతున్నదని వాపోతున్నారు. వినియోగంలోకి రాకుంటే పాడు బడే అవకాశం లేకపోలేదని చెబుతున్నారు.

సిబ్బంది అవస్థలు

ఎక్సైజ్ కార్యాలయం రెండు చిన్న గదులతో కూడిన అద్దె భవనంలో కొనసాగుతోంది. మౌలిక సదుపాయాలు లేక సిబ్బంది విధులు నిర్వహించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అరకొర సదుపాయాల మధ్యే పనులు కొనసాగిస్తున్నారు. ఇంకా వర్షాకాల సీజన్‌లో భవనం పైకప్పు ఉరిసి ఫైళ్లు తడస్తుంటాయని, వేసవిలో ఎండ తీవ్రతను తట్టుకోలేకపోతున్నామని అధికారులు పేర్కొన్నారు.

బిల్లులు చెల్లించపోవడంతోనే..

సదరు కాంట్రాక్టర్ 2021లో భవన నిర్మాణ పనులు పూర్తి చేశాడు. ఎనిమిది లక్షల వరకు బకాయి మంజూరు కాకపోవడంతో ప్రభుత్వానికి అప్పగించకుండా తాళం వేశాడట. ఇప్పుడు అక్కడి పరిసరాలు ముళ్ల పొదలు, చెత్తాచెదారంతో నిండిపోయి ఉన్నాయి. లోపలికి వెళ్లలేని పరిస్థితి.పైగా మందుబాబులు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది.

ఎన్నికల తర్వాత తరలిస్తాం

ప్రస్తుతం ఉన్న పాత అద్దె భవనంలో ఇబ్బందులున్నాయి. వర్షం కురిస్తే కార్యాలయంలోకి నీరు వచ్చిన సందర్భాలు కోకొల్లలు. నూతన భవనం పూర్తయింది కానీ కాంట్రాక్టర్‌కు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎన్నికలు పూర్తయిన తర్వాత కొత్త భవనంలోకి కార్యాలయాన్ని మారుస్తాం

– సుబ్రహ్మణ్యం, సీఐ ఎక్సైజ్ శాఖ

క్లుప్తంగా

బాల్య వివాహాలుచేస్తే శిక్షార్హులు



ప్రతిజ్ఞ చేస్తున్న జడ్జి అనిత, అధికారులు

నర్సాపూర్: బాల్య వివాహాలుచేస్తే శిక్ష తప్పదని జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ కె.అనిత హెచ్చరించారు. బుధవారం స్థానిక సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, సాంఘిక సంక్షేమ శాఖల బాలికల వసతి గృహాలలోని మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థినులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలను నిర్మూలించేందుకు బాలికలకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆమె సూచించారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలన కోసం విద్యార్థినులతో పాటు ఆమె ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎస్‌ఐ శివ కుమార్, న్యాయవాదులు, పలు వసతిగృహాల సంక్షేమ అధికారులు గాయత్రి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే గుర్తింపు

జూనియర్ సివిల్ జడ్జి శివరంజని



మాట్లాడుతున్న జడ్జి శివరంజని

హుస్నాబాద్: విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని జూనియర్ సివిల్ జడ్జి శివ రంజని అన్నారు. స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయంలో బుధవారం అంతర్జాతీయ గర్ల్ చైల్డ్ డే సందర్భంగా ఆడపిల్లల హక్కులపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ రాజ్యాంగం ఆడ పిల్లలు జీవించడానికి కొన్ని హక్కులను కల్పించిందన్నారు. సెల్ ఫోన్లతో సమయాన్ని వృథా చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల స్పెషల్ అధికారి మమత, న్యాయవాదులు బాకం సంపత్, ప్రవీణ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో జట్టుకు విద్యార్థినులు



రాష్ట్ర ఖోఖో జట్టుకు ఎంపికైన విద్యార్థినులు

తొగుట(దుబ్బాక): రాష్ట్ర స్థాయి అండర్ 19 ఖోఖో జట్టుకు తొగుట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని రంగ బోయిన మానస, ఎంపీసీ ప్రథమ సంవత్సరం విద్యార్థిని సీత మమత ఎంపికైనట్టు పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని వారు అత్యుత్తమ ప్రతిభకనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికకావడం అభినందనీయమన్నారు. కళాశాల విద్యార్థినులు రాష్ట్ర జట్టుకు ఎంపిక కావడంపై జిల్లా ఇంటర్ విద్యాధికారి సూర్యప్రకాష్ హర్షం వ్యక్తం చేశారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి చంద్రశేఖర్

జహీరాబాద్: మండలంలోని బూర్దిపాడ్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు నర్సింహులు గుండెపోటుతో మరణించాడు. బంధువులు సమాచారం ప్రకారం.. నర్సింహులు ఝరాసంగం మండలంలోని కక్కరవాడ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. బుధవారం తెల్లవారున గుండె పోటు కు గురై మృతి చెందారు. ఆయన భౌతిక కాయాన్ని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ వై.నరోత్తమ్, మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్, సామాజిక ఉద్యమ కారుడు ఢిల్లీ వసంత్, ఆయా ఉపాధ్యాయ సంఘాల నేతలు, కాంగ్రెస్, బీజేపీ, బీ ఆర్ఎస్ నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

గృహ'లక్ష్మి' వరించేనా..!

- అర్ధాంతరంగా నిలిచిన నిర్మాణాలు
- ఆర్థిక సహాయం కోసం ఎదురు చూపులు



గాంధీనగర్‌లో అసంపూర్తిగా ఉన్న ఇల్లు

హుస్నాబాద్‌రూరల్: పేదల సొంతింటి కల సాకారం చేయడానికి ప్రభుత్వం గృహలక్ష్మి పథకం ప్రవేశ పెట్టి నియోజకవర్గానికి మూడు వేల ఇళ్లు మంజూరు చేసింది. హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లో ఎస్సీ, ఎస్టీ కుటుంబాల సంఖ్య ఎక్కువే. వారిలో చాలామందికి సొంత ఇళ్లు లేవు. దీంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకం ద్వారా డబుల్ బెడ్రూం ఇళ్లు తమకు వస్తాయని ఎదురు చూసినా.. వారందరికీ నిరాశే ఎదురైంది. ఇంటి నిర్మాణ వ్యయం పెరగడంతో ఇళ్లు నిర్మించుకునే వారికి గృహలక్ష్మి పథకం కింద రూ.3 లక్షల ఆర్థిక సహాయం చేయాలని ఉత్తర్వులు ఇవ్వడం, నియోజకవర్గానికి 3 వేల ఇళ్లు మంజూరు చేయడంతో పేదలు తమకు సొంత ఇళ్లు వస్తాయని ఆశించారు. 162 గ్రామాలు ఉన్న నియోజకవర్గానికి 3 వేలు ఇళ్లను గ్రామాల వారీగా కేటాయిస్తే ఊరికి 15 నుంచి 20 మందికే లబ్ధి చేకూరింది. ఇంకా చాలా మంది పేదలు సొంత ఇళ్ల కోసం ఎదురు చూస్తున్నారు.

నిబంధనల పేరుతో దరఖాస్తుల తిరస్కరణ

సిద్దిపేట జిల్లాలో హుస్నాబాద్ నియోజకవర్గంలో చాలా తక్కువ దరఖాస్తులు రావడం అధికారుల కొర్రీలకు నిదర్శనం. బీసీ బంధు పథకం లబ్ధిదారులకు గృహలక్ష్మి దరఖాస్తును అధికారులు తిరస్కరించారు. దీంతో చాలా మంది నిరాశకు గురయ్యారు. ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో ఇళ్లను స్లాబ్‌లు వేసి వదిలేశారు. గృహలక్ష్మి పథకం ద్వారా ప్రభుత్వం రూ.3లక్షల ఆర్థిక సాయం చేస్తే తమ ఇళ్లనిర్మాణం పూర్తిచేసుకుంటామని వారంతా వేడుకుంటున్నారు.

మండలానికి 281 ఇళ్లు

ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గృహలక్ష్మి పథకం కోసం మండలంలో 781 దరఖాస్తులను ఆన్‌లైన్ చేశాం. అందులో 281 మందిని ఎంపికచేసి ప్రక్రియ మొదలు పెట్టాం. ప్రభుత్వ నిబంధనల మేరకు క్షేత్ర స్థాయిలో విచారణ చేసిన తర్వాతనే ఎంపిక చేస్తాం. ప్రభుత్వం నిబంధనలు సడలిస్తే మరికొన్ని దరఖాస్తులను తీసుకుని ఆన్‌లైన్ చేస్తాం.

– ఎంపీడీఓ రాఘవేంద్రరెడ్డి, హుస్నాబాద్

అక్రమ కేసులు బనాయించడం సరికాదు

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషణ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న విభీషణ్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు, బీజేపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టడం సరికాదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషణ్‌రెడ్డి అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ సిద్దిపేట రైల్వేస్టేషన్ ప్రారంభోత్సవ సమయంలో బీఆర్ఎస్ నాయకుల ప్రవర్తన ఘర్షణకు దారి తీసిందన్నారు. మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి దేశ ప్రధానిని అవమానించేలా చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులపై బీజేపీ నాయకులు ఫిర్యాదు చేయగా ఇంత వరకు కేసు నమోదు చేయలేదన్నారు. ఈ అక్రమ కేసులను ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కొత్తపల్లి వేణుగోపాల్, నరేష్, యాదవ్‌రావు, సత్యనారాయణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధిగల్లపేట సిద్దిపేట

పుష్పగిరి పీఠాధిపతి శంకర భారతీ స్వామీజీ



మాట్లాడుతున్న శంకర భారతీ స్వామీజీ

కొండపాక(గజ్వేల్): సిద్ధిగల్లపేట సిద్దిపేట అని పుష్పగిరి పీఠాధిపతి శంకర భారతీ స్వామీజీ పేర్కొన్నారు. కొండపాక శివారులోని ఆనంద నిలయం ఆవరణలో నిర్మిస్తున్న అష్టాదశ శక్తి పీఠ సహిత రామలింగేశ్వర దేవాలయ నిర్మాణాన్ని ఆయన బుధవారం సందర్శించారు. నిర్మాణానికి సంబంధించి కొన్ని సలహాలు, సూచనలు చేశారు. స్వామీజీ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఉన్న 18 శక్తి పీఠాల్లో కొండపాకలో నిర్మించే పీఠం ఒకటన్నారు. సిద్దిపేట ప్రాంతం ఎంతో పుణ్యస్థలంగా వెలుగొందుతుందన్నారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ చైర్మన్ లత, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షురాలు చిట్టి మాధురిరెడ్డి, ఆనంద నిలయం ట్రస్టు సభ్యులు వైకుంఠం, గట్టు రవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అకస్మాత్తుగా టిప్పర్ యూ టర్న్

- ఢీ కొన్న స్కూల్ బస్సు
- విద్యార్థులకు తప్పిన పెను ప్రమాదం



ప్రమాదంలో ముందు భాగం దెబ్బతిన్న స్కూల్ బస్సు

మనోహరాబాద్(తూప్రాన్): అకస్మాత్తుగా టిప్పర్ డ్రైవర్ యూటర్న్ తీసుకోవడంతో స్కూల్ బస్సు ఢీ కొట్టింది. దీంతో పలువురు విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం మేడ్చల్‌లోని విజ్ఞాన్ పాఠశాల బస్సులో కూచారం, కాళ్లకల్ గ్రామాల విద్యార్థులు ఎక్కారు. ఈ క్రమంలో కాళ్లకల్ శివారులో జాతీయ రహదారి 44పై క్రెస్ట్ కేబుల్ పరిశ్రమ సమీప యూర్న్ వద్ద టిప్పర్ వేగంగా రోడ్డుపైకి రావడంతో స్కూల్ బస్సు ఢీకొంది. దీంతో బస్సు డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. విద్యార్థులు, టీచర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అయితే బస్సు ముందు భాగం ధ్వంసమైంది. విషయం తెలుసుకున్న స్థానికులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విద్యార్థులకు చికిత్స చేయించి పాఠశాలకు పంపించారు. బస్సు డ్రైవర్ ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

ఫార్మసీ రంగానికి ఉజ్వల భవిష్యత్తు

జాతీయ డిప్యూటీ డ్రగ్స్ కంట్రోలర్ డా.రాంకిషన్



టాపర్ విద్యార్థినులతో రాంకిషన్ తదితరులు

కొండపాక(గజ్వేల్): ఫార్మసీ రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఉందని జాతీయ డిప్యూటీ డ్రగ్స్ కంట్రోలర్ డాక్టర్ రాంకిషన్ అన్నారు. మండంలోని వెలికట్ట శివారులోని శ్రీకృప ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో బుధవారం నిర్వహించిన ప్రైన్సు ఓరియెంటేషన్ ప్రోగ్రాంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలు ఫార్మసీ రంగంలో దూసుకుపోతున్న భారతదేశం వైపు చూస్తున్నాయని పేర్కొన్నారు. కొండపాకలో బీ ఫార్మసీ కళాశాల ఏర్పాటు ఈ ప్రాంత విద్యార్థుల అదృష్టమన్నారు. జాతీయ డ్రగ్స్ మ్యానుఫేక్చర్స్ అసోసియేషన్ చైర్మన్ రాజమౌళి మాట్లాడుతూ కళాశాలలో 19సార్లు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించుకోవడం గొప్ప విషయమన్నారు. కళాశాల నుంచి 16 బ్యాచ్‌ల విద్యార్థులు ఫార్మసీరంగంలో ఉన్నత స్థానాల్లో ఉండటం సంతోషదాయకమన్నారు. అనంతరం టాపర్లుగా నిలిచిన నలుగురు విద్యార్థినులను శాలువాతో సన్మానించి, వెండి పతకాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మల్లారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పండ్లు, కూరగాయల పంటలతో అధిక దిగుబడులు

సెంట్రల్ ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ శాస్త్రవేత్తలు



కూరగాయల పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

మర్కూక్(గజ్వేల్): పండ్లు, కూరగాయల తోటల ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని సెంట్రల్ ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ జీడిమెట్ల, హైదరాబాద్ శాస్త్రవేత్తలు సూచించారు. పాతూరు గ్రామంలో కూరగాయల పంటలపై ఫార్మర్ ఫీల్డ్ స్కూల్ నిర్వహించారు. వంగ పంటలో పండ్లు, రెమ్మల తొలుచు పురుగు నివారణ గురించి రైతులకు అవగాహన కల్పించారు. అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి డా.స్వేత, ప్లాంట్ పాథాలజీ అధికారి సుధ, హార్టికల్చర్ అధికారి సౌమ్య, వ్యవసాయ విస్తరణ అధికారి రజినికాంత్, రైతులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతిపై విచారణ



కపూర్‌నాయక్‌తండాలో విచారిస్తున్న వైద్యబృందం

అక్కన్నపేట(హుస్నాబాద్): విద్యార్థి మృతిపై వైద్య బృందం విచారణ చేపట్టింది. ఈ ఘటన కపూర్‌నాయక్‌తండాలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అజ్మీర భాస్కర్‌నాయక్, స్వరూప దంపతుల పెద్దకుమారుడు అజ్మీర చరణ్(14) మంగళవారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడు హుస్నాబాద్‌లోని ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. వారం రోజులుగా జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడుతూ హాస్టల్ నుంచి ఇంటికి వచ్చాడు. తల్లిదండ్రులు ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. అయినా ఫలితం లేకపోవడంతో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయంపై రామవరం పీహెచ్‌సీ వైద్యాధికారి వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలో విచారణ చేపట్టారు. బాలుడి మృతిపై తల్లిదండ్రులను అడిగి పలువివరాలను, వైద్యపరీక్షలు చేయించిన రిపోర్టులను పరిశీలించారు. బాలుడు డెంగీతో మృతి చెందలేదని, వంశపార్యం పరంగా వచ్చే వ్యాధి కారణంగా మృతి చెందినట్లు డాక్టర్ వినోద్ రెడ్డి వెల్లడించారు. బాధిత కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని సర్పంచ్ భానోతు సంతోష్‌నాయక్ కోరారు.

ప్రభుత్వ భూమిలో ఆయిల్‌పామ్

- దర్జాగా ఆక్రమించి సాగు
- చర్యలకు స్థానికుల డిమాండ్



ప్రభుత్వ భూమిలో సాగుచేసిన ఆయిల్‌పామ్

అక్కన్నపేట(హుస్నాబాద్): ప్రభుత్వ భూమిలో యథేచ్ఛగా ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నాడు ఒక ఘనుడు. మండల పరిధిలోని కుందనవానిపల్లి గ్రామ శివారులో వైకుంఠధామ, డంప్‌యార్డు, క్రీడాప్రాంగణం మైదానానికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిలో ఒకరైతు కొంత భాగాన్ని ఆక్రమించి దర్జాగా ఆయిల్‌పామ్ సాగుచేస్తున్నాడని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల సమాచారం ప్రకారం.. సర్వే నంబర్ 96లో వందల ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఆయిల్‌పామ్ సాగుచేస్తున్న రైతుకు గత ప్రభుత్వం మూడెకరాల భూమినిచ్చింది. దానితో పాటు ఆ రైతు పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని కూడా కొంత భాగం ఆక్రమించుకుని దర్జాగా సాగు చేసుకుంటున్నాడని, దీనిపై అధికారులకు ఫిర్యాదులు చేశామని గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వ భూమిలో సాగు చేసిన రైతుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ సంజీవ్‌కుమార్‌ను సంప్రదించగా.. ఆర్ఐని పంపించి విచారణ చేపడతానని చెప్పారు. ఎవరైనా ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

భర్త ప్రశ్నించడంతో వివాహిత అదృశ్యం



అనురాధ (ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): భర్త ప్రశ్నించడంతో వివాహిత అదృశ్యమైన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రవికాంత్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పోతులబోగుడ గ్రామానికి చెందిన మాచవరం సుధాకర్‌కు 2013లో తూప్రాన్ మండలం యావపూర్ గ్రామానికి చెందిన కాగిత అనురాధతో వివాహం జరిగింది. వారికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో అనురాధ సోమవారం ఫోన్‌లో మాట్లాడుతుండగా భర్త ప్రశ్నించడంతో గొడవపడింది. చిట్టి డబ్బులు కట్టడానికని ఆమె మంగళవారం ఇంట్లోంచి వెళ్లి సాయంత్రమైనా తిరిగి ఇంటికి రాకపోవడంతో సుధాకర్ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. బీరువాలో ఉన్న రూ.50 వేలు కనిపించలేదని భర్త ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ఫైనాన్స్ సిబ్బంది బైక్ తీసుకెళ్లారని..



ప్రవీణ్ (ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): బైక్ ఫైనాన్స్ కట్టకపోవడంతో ఫైనాన్స్ సిబ్బంది బైక్‌ను తీసుకుని వెళ్లారని మనస్తాపంతో యువకుడు అదృశ్యమైన ఘటన పోతులబోగూడ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రవికాంత్‌రావు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మంద ప్రవీణ్ గతంలో మేడ్చల్‌లోని ఓ ప్రవేట్ ఫైనాన్స్‌లో బైక్‌ను కొనుగోలు చేశాడు. కాని మూడు నెలలుగా వాయిదాలు చెల్లించక పోవడంతో ఈ నెల 3న ఫైనాన్స్ సిబ్బంది బైక్‌ను తీసుకుని వెళ్ళిపోయారు. వేలం వేయనున్నట్లు మంగళవారం నోటీస్ పంపించారు. దీంతో మనస్తాపానికి గురైన ప్రవీణ్ షోరూంకు వెళ్లి వస్తానని చెప్పి ఇంట్లోంచి వెళ్లిపోయాడు. రాత్రైనా తిరిగి రాకపోవడంతో తండ్రి మంద మైసయ్య ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్య

జీవితంపై విరక్తితో టీచర్...



రమేశ్ (ఫైల్)

దుబ్బాక: జీవితంపై విరక్తి చెందిన ఓ ఉపాధ్యాయుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ గంగరాజు కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన యెమాజీగారి రమేశ్(48) ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించేవాడు. రెండేళ్ల క్రితం ఆయన పక్షవాతం బారిన పడ్డాడు. అప్పటి నుంచి విధులు సక్రమంగా నిర్వహించలేకపోవడం, ఆర్థిక సమస్యల్లో కూరుకుపోవడం.. పెళ్లి కాకపోవడంతో మనోవేదన చెందుతూ ఉండేవాడు. ఈ క్రమంలో రమేశ్ జీవితంపై విరక్తితో మంగళవారం అర్ధరాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్య యత్నించాడు. బుధవారం ఉదయం వాంతులు చేసుకుంటున్న ఆయనను గమనించిన కుటుంబ సభ్యులు దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

మద్యం మత్తులో ఉరివేసుకొని..

పటాన్‌చెరు టౌన్: మద్యం మత్తులో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన పటాన్ చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన జగదీశ్ దేశ్‌ముఖ్(38) భార్య శ్రీదేవితో కలిసి ఇస్నాపూర్ చౌరస్తాలో నివాసం ఉంటూ ఒక ప్రైవేట్ కంపెనీలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వారి కూతురు శాలిని(3) ఇటీవల అనారోగ్యానికి గురవడంతో జగదీశ్ భార్య శ్రీదేవి తమ పాపను తీసుకుని బీదర్ వెళ్లింది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి జగదీశ్ మద్యం మత్తులో భార్యకు ఫోన్‌చేసి తాను చనిపోతానని చెప్పాడు. దీంతో శ్రీదేవి తనకు పరిచయస్తుడైన బాలాజీకి ఫోన్‌చేసి వెళ్లి చూడమని కోరింది. ఆయన ఇంటికి వెళ్లి చూసేలోపు సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఉండటం గమనించి సమాచారం అందించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

షార్ట్ సర్క్యూట్‌తో కిరాణా దుకాణం దగ్ధం

రూ.20లక్షల వరకు నష్టం



దుకాణంలో కాలిబూడిదైన సామగ్రి

సంగారెడ్డి టౌన్: షార్ట్ సర్క్యూట్‌తో కిరాణా దుకాణం దగ్ధమయిన ఘటన పట్టణ పరిధిలోని పోతిరెడ్డిపల్లిలో చోటుచేసుకుంది. చౌరస్తాలోని కిరాణా దుకాణం నిర్వాహకుడు హనుమంతు రోజు మాదిరిగా బుధవారం మధ్యాహ్న సమయంలో దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్ళాడు. వెళ్లిన కొంతసమయానికి ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ రావడంతో మంటలు వ్యాపించాయి. స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేశారు. అప్పటికే దుకాణంలో ఉన్న సామగ్రి కాలిబూడిదయింది. సుమారు రూ. 20 లక్షల వరకు నష్టం సంభవించినట్టు యజమాని వాపోయాడు. ఆర్థికంగా ఆదుకోవాలని కోరాడు.

ఆశపడితే అంతేసంగతులు

- రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు
- రెండు నెలల్లో 515 కేసులు
- ఆన్‌లైన్ జాబ్, ఫోన్ కాల్స్‌తో బురిడీ
- మోసపోయిన వారిలో చదువుకున్నవారే అధికం

సైబర్ నేరాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లోనే జిల్లాలో 515 సైబర్ మోసాల కేసులు నమోదయ్యాయి. వాటిలో అమీన్‌పూర్, పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోనే ఎక్కువ జరుగుతున్నాయి. మోసపోతున్నవారిలో చదువుకున్న వారే అధికంగా ఉండటం గమనార్హం.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: చదువుకుని, ఉద్యోగాలు చేస్తున్న వారిని లక్ష్యంగా చేసుకుని కొత్త తరహాల్లో సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ రెచ్చిపోతున్నారు. ప్రతి రోజు అధిక సంఖ్యలో సైబర్ కేసులు నమోదవడం ఆందోళన కలిగిస్తోంది. బాధితులు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించినా నేరగాళ్లను పట్టుకున్న ఘటనలు చాలా తక్కువే. ఆన్‌లైన్ మోసాల వల్ల ప్రజలు అధిక మొత్తంలో నష్టపోతున్నారు.

మోసపోతున్నది ఇలా..

ఆన్‌లైన్ ఉద్యోగాలు, పార్ట్‌టైం జాబ్ అంటూ వచ్చిన మెసేజ్‌లకు స్పందించడం; ఫేస్ బుక్, ఇన్‌స్టాగాం వంటి సోషల్ మీడియా యాప్స్‌లో వాహనాలు, సెకండ్ హ్యాండ్ వస్తువుల ప్రకటన లింక్‌లను క్లిక్‌చేయడం; పార్ట్ టైం జాబ్ పేరుతో టాస్కులు ఇస్తూ నగదు ఇన్వెస్ట్ చేయించడం; అధిక డబ్బు సంపాదించవచ్చని ఆశ చూపించడం; డెబిట్, క్రెడిట్ కార్డులు అప్డేట్ చేయాలనడం; ఫోన్ ద్వారా డబ్బులు చెల్లిస్తామనే పేరుతో సైబర్ వలకు చిక్కుతున్నారు.

ఇటీవలే జరిగిన ఘటనలు

పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సింఫోని కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి ఆగస్టు 17న పార్ట్ టైం జాబ్ అంటూ తన వాట్సాప్‌కు మెసేజ్ వచ్చింది. ఆ ఉద్యోగి తన వివరాలు నమోదు చేశాడు. తర్వాత పలు దఫాలుగా రూ.30 లక్షలు చెల్లించాడు. అయితే సైబర్ నేరగాళ్లు ఆయన వాలెట్‌లో నగదుతో పాటు కమీషన్ చూపిస్తూ వచ్చారు. ఒక సమయంలో తన నగదుతో పాటు కమీషన్‌ను ఇవ్వాలని అడగడంతో అసలు విషయం బయట పడింది. దీంతో బాధితుడు తాను మోసపోయినట్టు గుర్తించి సైబర్‌తో పాటు పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదే తరహాలో రామచంద్రపురం మండల పరిధిలోని ఈదునాగులపల్లికి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి రూ.26 లక్షలు, అమీన్‌పూర్ మండల పరిధిలోని లాలాబాయ్ కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.28 లక్షలు చెల్లించారు. చివరిగా వారు తమ నగదు, కమీషన్ ఇవ్వాలని అడగ్గా స్పందనలేకపోవడంతో వారు సైబర్ పోలీసులకు సమాచారం ఇచ్చి, అమీన్‌పూర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

1930కి సమాచారం అందించాలి



సాఫ్ట్‌వేర్, ప్రైవేటు ఉద్యోగులు, చదువుకున్నవారే ఎక్కువగా సైబర్ వలలో చిక్కుకుని మోసపోతున్నారు. పటాన్‌చెరు, అమీన్‌పూర్ బీడీఎల్, జిన్నారం బొల్లారం, గుమ్మడిదల, హత్నూర పోలీస్‌స్టేషన్ పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అపరిచితుల నుంచి వచ్చే లింకులు, ఫోన్‌కాల్స్‌కు వ్యక్తిగత సమాచారం ఇవ్వద్దు. టాస్కులు, కమిషన్‌ల పేరుతో వచ్చే ఆన్‌లైన్ జాబులను నమ్మొద్దు.

– డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, పటాన్‌చెరు

పోలీసుల సూచనలు

అపరిచితుల వాట్సప్, ఫోన్‌కాల్స్‌కు స్పందించకుండా ఉండాలి. ఆన్‌లైన్లో తక్కువ ధరకే వస్తువులు, సేవలు అందిస్తామనే ప్రకటనలు చూసి మోసపోవద్దు. అన్నీ పరిశీలించిన తర్వాతే నగదు చెల్లించాలి. సోషల్ నెట్వర్క్ సైట్లలో మహిళలు ప్రైవసీకి ప్రాధాన్యం ఇవ్వాలి. ఎవరితోనూ వ్యక్తిగత ఫోటోలు షేర్ చేసుకోకపోవడమే మంచిది. ఉచిత వైఫై, ఓపెన్ నెట్‌వర్క్‌ల ద్వారా లాగిన్‌ఐతే సైబర్ నేరగాళ్లు పాస్‌వర్డ్ దొంగతనంచేసే అవకాశం ఎక్కువ.